



సూర్య www.suryaa.com

# ప్రజ్ఞ

suryaapragnamagazine@gmail.com

బుధవారం 22 అక్టోబర్ 2025 పేజీలు 8




# వినగ వినగ...
# విమర్శ కూడా తియ్యగనుండు..!

పాలిటి ★ Reasoning ★ జాగ్రఫీ


ఐక్యరాజ్యసమితి

ప్రజ్ఞ సంచిక కోసం
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి


ఉద్యోగ సమాచారం



ఎకానమి

సూర్య
www.suryaa.com
బుధవారం | అక్టోబర్ 22 | 2025

**పోటీపరీక్షల ప్రత్యేకం**

# వినగ వినగ... విమర్శ కూడా తియ్యగనుండు..!

**ఒకరు మరొకరిని విమర్శిస్తున్నారు. మరొకరు ఇంకొకరిని విమర్శిస్తున్నారు. ఇంకొకరు వేరే వాళ్ళని విమర్శిస్తున్నారు. ఇలా విమర్శించుకుంటూ బతుకుతున్నారు. బహుశా వీరికి విమర్శించడంలో ఏ సంతోషమో, శాడిజమో లభిస్తూ ఉండి ఉండవచ్చు. ఎవరో ఒక కవి అన్నట్లు 'విమర్శ మొదట కళ్ళల్లో ప్రారంభమయి ఆనక శరీరమంతా పాకు తుందట. వాళ్ళెవరో మనకు తెలియదు, అలాగని చుట్టాలూ కాదు, దూరపు మిత్రులూ కాదు. అయినా విచ్చలవిడిగా విమర్శిస్తుంటారు.**

తాను తన జీవితంలో ఎంతో కష్టపడి ఎదిగాడు. ఒక లెవల్‌కి చేరారు. అయినా తనని ప్రశంసించాల్సింది పోయి నోటికి ఏది వస్తే అది విమర్శించటమే. దౌర్భాగ్యం ఏంటంటే సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఇలాంటి తిక్క విమర్శలకు అంతూ పొంతూ లేకుండా పోయింది. ఒకరు మరొకరిని ఎందుకు విమర్శిస్తారంటే నాకు తెలిసినంతవరకూ ఈర్ష్య, జెలస్సీ. ఈ ఈర్ష్య వల్ల, జెలసీ వల్ల అచేతనంలోకి వెళ్ళటం తప్ప మరో ఆప్షన్ ఉండదు. ఎవరికి? విమర్శించిన వారికి.

విమర్శలు రెండు రకాలు. ఒకటి సద్విమర్శ. రెండు.. ఉద్దేశపూర్వక విమర్శ. సద్విమర్శలు చేసేవారు ఖచ్చితంగా మన ఆత్మీయులో, మంచి కోరే వారో అయి ఉంటారు. మన పెద్దలు మన రక్తం పంచుకొని పుట్టినవారు సద్విమర్శలు చేస్తారు. మళ్ళీ వీళ్ళల్లో కూడా బ్రహ్మాండంగా జెలసీ చూపే వాళ్ళుంటారు. ఇది ఎదుటివారు లేదా బయటివారు చూపించే జెలసీ కన్నా దారుణంగా ఉంటుంది. దీనిని భరించడం చాలా చాలా కష్టం. మనం ప్రపంచాన్ని గెలవవచ్చు. దేశాధినేతతో అవార్డులు తీసుకోవచ్చు. దేశమంతా మన కాళ్ళకు మొక్కవచ్చుగాక, మన ఇంట్లో వారు, మన ఆప్తులు విమర్శిస్తే కలిగే బాధపీక్స్‌లో ఉంటుంది. శరీరాన్ని పగలగొట్టుకొని కళ్ళ ద్వారా కన్నీళ్ళు వచ్చేస్తాయి.

సరే ఉద్దేశ్యపూర్వకముగా విమర్శించే వాళ్ళ సైకాలజీ చూద్దాం, వీళ్ళు ఎలా ఉంటారంటే, పని పాట చేయరు, వీరు ఎదగరు, ఎదిగేవాళ్ళపై పడి ఏడుస్తారు. మాటలెక్కువ, అబద్ధాలకి అలవాటు పడి అలవోకగా అబద్ధాలు చెప్పి, ఎదుటివాళ్ళను నమ్మించేస్తారు. నాకు తెలిసి విమర్శించే వారిలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే. ఎదుటివారిని కావాలనే విమర్శిస్తున్నపుడు మన అర్హత మనం తెలుసుకోవాలి. మనం ఎదుటి వారి ఎదుగుదలను విమర్శిస్తున్నాము, దీనివల్ల మనం ఎమోషన్‌కి గురి అవుతున్నాం, శరీరంలో ప్రమాదకర రసాయనాలు ఊరుతున్నాయి, ఇవి గుండెకి హాని చేస్తాయన్న కనీస వైద్య పరిజ్ఞానం లేకపోవటం దురదృష్టం.

ఇంకో రకం ఉంటారు. ఈ రకం ఏం చేస్తారంటే ఎదుటివారు గాని, కొలీగ్స్ గాని, తమ ఊరోళ్ళు గాని కష్టపడి ఒక ఘన విజయం




సాధించారనుకోండి, అస్సలు.... అమ్మతోడు అస్సలు ప్రశంసించరు. పొగడొద్దు, కానీ ప్రశంసించాలి కదా. కానీ అది వీళ్ళనుండి జరగదు. మూర్తీభవించిన మూర్తులయి ఉంటారు. ఇక్కడ తండ్రి బిడ్డలను పొగడకూడదు, ప్రశంస కూడా చేయకూడదు. చేస్తే పిల్లలకి ఇగో వచ్చేస్తుంది అన్నది ఉంది. ఇది ఓకే. బట్ మిత్రులను ప్రశంసించకపోతే ఆ మాత్రం మనసు రాకపోతే రేపు మనలను ఎవరు ప్రశంసిస్తారు? మనం కూడా జీవితంలో చాలానే విజయాలు సాధించి ఉంటాము కదా! 'ఒకరి విజయాన్ని ప్రశంసిస్తే మనం తక్కువ అయినట్టు కాదు'! ఆ ప్రశంస వాళ్ళకు బూస్ట్ నిస్తుంది. మనవారు ఫలానా ప్లేస్‌లో టాప్ పొజిషన్‌లో ఉన్నారంటే మనకి గర్వం కదూ?! ఇక్కడ ప్రధానంగా మనం ప్రదర్శించవలసినది కొంతలో కొంత హృదయ విస్తరణ.

మరో రకం ఉంటారు. ఎదుటివారు ఎదిగిన వెంటనే వీళ్ళు ముడుచుకొని పోతారు. ఇక గెలిచిన వారిని పలకరించరు. దూరం దూరం జరిగిపోతుంటారు. ఎప్పుడయినా, ఎక్కడయినా కలుసుకున్నా సరిగ్గా పలకరు. వీరిలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఎక్కువ. ఏదో మానసిక డెప్త్‌లో వెళ్ళిపోతారు. ఇలా సంవత్సరం, లేదా మరో సంవత్సరం ఉంటారు. ఆనక మెల్లమెల్లగా మిత్రుడి ఘనవిజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ తిరుగుతారు. టాపిక్ తీసిమరీ చెప్తారు. మళ్ళీ వీళ్ళతో ఇంకో ప్రమాదం ఉంది. గొప్పగానూ చెప్తారు లేదా ఎగ్రసివ్‌గా తయారయి బాడ్ ప్రచారం చేస్తారు. మరో అడుగు ముందుకు వేసి నా వల్లే అతను లేదా ఆమె ఘనవిజయం సాధించారు, అసలు చేసింది నేనే, నేనే సలహా ఇచ్చాను అంటూ అబ్బా! దేశమంతా చెప్పుకుంటూ తిరుగుతారు. ఈ మొత్తం ప్రాసెస్‌లో తమ ఎదుగుదలను తమ కష్టాన్ని గాలికి వదిలేస్తారు.

హ్యూమన్ సైకాలజీ చాలా డేంజర్‌గా ఉంటుంది. సోషల్ మీడియా వచ్చిన తర్వాత పెద్దా, చిన్నా తేడా లేకుండా పోయింది. చేతిలో స్మార్ట్ ఫోన్ వల్ల నోటికొచ్చినట్లు కామెంట్లు పెట్టేసి పక్కకి జరుగుతారు. అది కూడా సింపుల్‌గా. ఇక వాటి బారిన పడిన వారు లాక్కోలేక, పీక్కోలేక సూసైడ్‌లు చేసుకున్నవారెందరో. ఫేస్‌బుక్‌లో అయితే హద్దు లేదు. మంచి వీడియోల ద్వారా మంచి విషయాలను ప్రచారం చేసి ప్రపంచంలోనే పేరొందాలనే సదుద్దేశ్యంతో మార్క్ జూకర్ బర్గ్ 2004లో ఫేస్‌బుక్‌ని ప్రారంభించారు. వీరివే ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ థ్రెడ్స్ కూడా. వీటన్నింటిలో ఎంత పడితే అంత ఎదుటివారిపై , వారు ఎంత పెద్ద వాళ్ళయినా గానీ చటుక్కున విమర్శిస్తూ కామెంట్ పెట్టేస్తున్నారు. దీనికి బాధితులయిన వారు ఎంత సఫర్ అవుతారో పెట్టిన వాడికీ తెలుసును. ఇదో మానసిక రోగం. ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెస్ ఉండాలి గాని ఇంత విచ్చలవిడిగానా? తెలుగు పదాలు కనుక్కుంది బూతులు టైప్ చేయడానికా? అంటూ భాషా ప్రేమికులు రోదించేంత. కొందరు సామాజిక మీడియాలో అతి చేస్తారు. వారినీ సద్విమర్శ చేయండి. అంతేగాని అంత దారుణమయిన భాషనా?

సరే, మరి విమర్శల బారిన పడితే మనం ఎలా బయటపడాలి? కొంత కష్టమే. బట్ డోంట్‌కేర్. విమర్శించిన వారి ఉనికిని గుర్తించడానికి మన విలువయిన సమయాన్ని ఎందుకు వృధా చేయాలి? విమర్శించే వారు నిరంతరం చీకట్లో ఉండి వెలుగుని, వెలుతురుని ద్వేషిస్తుంటారు. వారు ఎప్పటికినీ చీకట్లోనే ఉంటారు.ఒకరు మిమ్మలను విమర్శిస్తున్నారంటే మీరు సరైన దారిలో ఉన్నారనే అర్ధం. మహాభారతంలో శ్రీకృష్ణుడు నిరంతరం వివాదాల మధ్య నిలబడే ధర్మబోధ చేసారు. నాయకుడి గొప్పతనం అతని ప్రశాంతతలో ఉన్నది.

**ఉద్దేశపూర్వకంగా విమర్శించిన వారిని కోపంతో కాదు, కరుణతో చూద్దాం. వాళ్ళ హృద యంలో పాపం ఏదో బాధ ఉంది. మానసిక సమస్య ఉన్నది. మనమే ప్రశాంతంగా ఉందాం. జాతిపిత గాంధీజీని సైతం విమర్శించే దురదృష్ట స్థాయి కి నేడు సోషల్ మీడియా వెళ్ళి పోయింది. మనమెంత...?**



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

# బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్ ఉద్యోగాలు

దేశ వ్యాప్తంగా ఉన్న పలు బ్రాంచుల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్ ఉద్యోగాల భర్తీకి బ్యాంక్ ఆఫ్ బరోడా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుత నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 50 మేనేజర్ (క్రెడిట్ అనలిస్ట్), సీనియర్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్), చీఫ్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్), సీనియర్ మేనేజర్ సీ , ఐసీ రిలేషన్‌షిప్‌మేనేజర్, చీఫ్ మేనేజర్ సీ, ఐసీ రిలేషన్‌షిప్‌మేనేజర్ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో అక్టోబర్ 30, 2025వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టుల వివరాలు..**

- మేనేజర్ (క్రెడిట్ అనలిస్ట్) పోస్టుల సంఖ్య: 1
- సీనియర్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్) పోస్టులు: 25
- చీఫ్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్) పోస్టుల సంఖ్య: 2
- సీనియర్ మేనేజర్ సీ & ఐసీ రిలేషన్‌షిప్‌మేనేజర్ పోస్టుల సంఖ్య: 16
- చీఫ్ మేనేజర్ సీ & ఐసీ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల సంఖ్య:6

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పోస్టును బట్టి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, సీఏ, సీఎంఏ, సీఎస్, సీఎఫ్ఏ, డిప్లొమా, పీజీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. సంబంధిత పని అనుభవం కూడా ఉండాలి.

అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ అర్హతలు కలిగిన వారు ఎవరైనా




ఆన్‌లైన్ విధానంలో తుది గడువులోగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.850, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, డీఈఎస్ఎం, మహిళా అభ్యర్థులు రూ.175 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలి.

ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేదా గ్రూప్ డిస్కషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు మేనేజర్ పోస్టులకు రూ.64,820 నుంచి రూ.93,960 వరకు, సీనియర్ మేనేజర్ పోస్టులకు రూ.85,920 నుంచి రూ.1,05,280 వరకు, చీఫ్ మేనేజర్‌పోస్టులకు రూ.1,02,300 నుంచి రూ.1,20,940 వరకు జీతంగా చెల్లిస్తారు.

ఇతర వివరాలకు https:// bankofbaroda.bank.in/ career/current-opportunities/ చూడండి.




# భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు

**భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు**
(Fundamental Rights)

**మూలం** (Source):

- అమెరికా రాజ్యాంగం నుండి వీటిని గ్రహించి మన రాజ్యాంగములో పొందుపరిచారు.
- రాజ్యాంగంలోని 3వ భాగం (Part III)లో ఇవి ఉన్నాయి.

మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల భావనను ఈ క్రింది అంశాల ఆధారంగా పొందుపరిచారు.

- మాగ్నా కార్టా – ఇంగ్లాండ్ – 1215
- బ్రిటిష్ Bill of Rights (1689)
- అమెరికా సంయుక్త రాష్ట్రాల Bill of Rights 1789 (1791 లో ధ్రువీకరించారు )
- ఫ్రెంచ్ Declaration of Rights of Man (1789)
- రష్యా ప్రజల హక్కుల ప్రకటన (1917)
- ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన (1948) నుండి స్వీకరించారు.

**ప్రాథమిక హక్కుల లక్షణాలు** (Key Features Characteristics)

1. ఇవి రాజ్యాంగ 3వభాగం - Part III (Articles 12-35) లో ఉన్నాయి.
2. ఇవి న్యాయంగా అమలు చేయదగినవి (Justiciable) - అంటే కోర్టులో వీటిని రక్షించుకోవచ్చు.
3. ఇవి మూలపౌర హక్కులు (Basic Human Rights), అందరికీ సమానంగా వర్తిస్తాయి.
4. వీటిని కేవలం చట్టబద్ధమైన పరిమితులలో మాత్రమే నియంత్రించవచ్చు.
5. రాష్ట్రం లేదా ప్రభుత్వ అధికారులచే ఉల్లంఘన జరిగితే, పౌరుడు న్యాయపరంగా సుప్రీంకోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించవచ్చు.

(Articles): 12 నుండి 35 వరకు గల నిబంధనలు వీటిని గురించి వివరిస్తాయి

**భాగం III - ప్రాథమిక హక్కులు**
(Part III - Fundamental Rights)

**1. సమానత్వ హక్కు** (Right to Equality)
ఆర్టికల్ 14 నుండి 18 వరకు గల నిబంధనలు వీటిని గురించి వివరిస్తాయి. సమానత్వ హక్కు భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభం.

**ఆర్టికల్** 14

- చట్టం ముందు సమానత్వం (Equality before Law)- ప్రభుత్వం వ్యక్తులను సమానంగా చూడాలి, ఏ వ్యక్తికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదు.

**ఆర్టికల్** 15

- వివక్ష నిషేధం (Prohibition of Discrimination) మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారంగా వివక్ష చూపరాదు.

**ఆర్టికల్** 16

- **ఉపాధిలో సమాన అవకాశాలు** (Equality of Opportunity in Public Employment) ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.

**ఆర్టికల్** 17
**అస్పృశ్యత నిషేధం** (Abolition of Untouchability)
అప్రజాస్వామికమైన అస్పృశ్యత పూర్తిగా రద్దు చేయబడింది. ఇది శిక్షార్హమైన నేరం.


**ఆర్టికల్** 18
**బిరుదులు రద్దు** (Abolition of Titles)
ప్రభుత్వం "రాజా", "సర్" వంటి ఎటువంటి బిరుదులు ఇవ్వకూడదు. గౌరవ బిరుదులు (Padma Awards) మాత్రం మినహాయింపు.

**2. స్వేచ్ఛా హక్కు** (Right to Freedom)

2. స్వేచ్ఛా హక్కు (Right to Freedom)
ఆర్టికల్ 19 నుండి 22 వరకు
ఆర్టికల్ 19 ఆరు రకాల స్వేచ్ఛలు వివరిస్తుంది.
భారత పౌరులకు ఉన్న 6 స్వేచ్ఛలు:
1) భావప్రకటన స్వేచ్ఛ 2) సమావేశ స్వేచ్ఛ
3) సంఘ స్వేచ్ఛ 4) సంచర స్వేచ్ఛ
5) స్థిర నివాస స్వేచ్ఛ
6) వృత్తి ,వ్యాపార స్వేచ్ఛ

**ఆర్టికల్** 20
**శిక్షల విషయంలో రక్షణ**
(Protection in Respect of Conviction for Offences)
ఒకే నేరానికి రెండుసార్లు శిక్ష వేయరాదు (Double Jeopardy), గత చట్టం ఆధారంగా శిక్ష వేయరాదు (Ex Post Facto Law).

**ఆర్టికల్** 21
జీవన హక్కు (Protection of Life and Personal Liberty)
చట్టబద్ధమైన విధానంలో తప్ప ఏ వ్యక్తి జీవన స్వేచ్ఛను హరించరాదు.




**ఆర్టికల్** 21A
**విద్యా హక్కు** ( Right to Education)
6-14 ఏళ్ల పిల్లలకు ఉచిత మరియు తప్పనిసరి విద్య. (86వ సవరణ – 2002).

**ఆర్టికల్ 22** అరెస్టు, నిర్బంధాల నుండి రక్షణ చట్టబద్ధమైన కారణం లేకుండా అరెస్టు చేయరాదు. నిర్బంధితులకు హక్కులు ఉంటాయి.

**3. దోపిడీకి వ్యతిరేక హక్కు** (Right against Exploitation) ఆర్టికల్ 23 మరియు 24

**ఆర్టికల్ 23**
బలవంతపు శ్రమ నిషేధం (Prohibition of Traffic in Human Beings and Forced Labour)
బానిసత్వం, బలవంతపు పనులు,మానవ విక్రయం నిషేధం.

**ఆర్టికల్ 24**
**బాల కార్మిక వ్యవస్థ నిషేధం** (Prohibition of Employment of Children in Factories)
14 ఏళ్లలోపు పిల్లలను కర్మాగారాలలో పనిచేయించడం నిషేధం.

**4. మత స్వేచ్ఛా హక్కు** (Right to Freedom of Religion) — ఆర్టికల్ 25 నుండి 28 వరకు

**ఆర్టికల్ 25 మత స్వేచ్ఛ**
ఏ మతాన్నైనా స్వేచ్ఛగా ఆచరించు, ప్రచారం చేయు హక్కు

**ఆర్టికల్ 26**
మత సంస్థల వ్యవహారాలు
మతసంబంధిత వ్యవహారాలు స్వతంత్రంగా నిర్వహించుకోవచ్చు.

**ఆర్టికల్ 27**
మత ప్రచారానికి పన్ను నిషేధం
మత ప్రచారం కోసం పన్నులు విధించరాదు.

**ఆర్టికల్ 28**
విద్యాసంస్థలలో మత బోధన
ప్రభుత్వ పాఠశాలల్లో మత బోధన నిషేధం
ప్రైవేట్ మైనారిటీ సంస్థలకు మినహాయింపు.

**5. సాంస్కృతిక, విద్యా హక్కులు** (Cultural and Educational Rights) — ఆర్టికల్ 29 మరియు 30

**ఆర్టికల్ 29**
మైనారిటీల సంస్కృతి రక్షణ భాష, లిపి, సంస్కృతిని కాపాడుకునే హక్కు.
ఆర్టికల్ విద్యాసంస్థల మైనారిటీలు తమ విద్యాసంస్థలను స్థాపన హక్కు స్థాపించి నిర్వహించవచ్చు.

**6. రాజ్యాంగ పరిహార హక్కు** (Right to Constitutional Remedies) — ఆర్టికల్ 32

**ఆర్టికల్ 32**
ప్రాథమిక హక్కుల రక్షణకు సుప్రీంకోర్టును ఆశ్రయించు హక్కు
"రాజ్యాంగ హృదయం మరియు ఆత్మ" – డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వ్యాఖ్య.

**5 రకాల రిట్లు** (Writs)

1. **హేబియస్ కార్పస్** (Habeas Corpus)
2. **మాండమస్** (Mandamus)
3. **ప్రొహిబిషన్** (Prohibition)
4. **కో వారంటో** (Quo Warranto)
5. **సర్టియోరారి** (Certiorari).

**7. పార్లమెంట్ అధికారాలు** (ఆర్టికల్ 33-35)

**ఆర్టికల్ 33**
సైన్య, పోలీసు సభ్యుల హక్కుల పరిమితి
దేశ భద్రత కోసమే వారి ప్రాథమిక హక్కులను పరిమితం చేయవచ్చు.

**ఆర్టికల్ 34**
అత్యవసర పరిస్థితుల్లో రక్షణ
సైనిక పాలన సమయంలో చర్యలకు రక్షణ.

**ఆర్టికల్ 35**
అమలు చట్టాల అధికారం
పై హక్కులకు సంబంధించిన చట్టాలు చేయగల అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది.

1. **ఆర్టికల్ 31 (ఆస్తి హక్కు)** 44వ సవరణ (1978) ద్వారా ప్రాథమిక హక్కు నుంచి తొలగించబడింది. ఇప్పుడు ఆర్టికల్ 300A రాజ్యాంగ హక్కుగా ఉంది.
2. ఆర్టికల్ 32 ను అంబేద్కర్ రాజ్యాంగానికి హృదయం ,ఆత్మ వంటిది గా పేర్కొన్నారు.
3. ప్రాథమిక హక్కులు కేవలం పౌరులకే వర్తించే కొన్ని (19, 29, 30), కానీ అందరి వ్యక్తులకు వర్తించే కొన్ని (14, 20, 21, 22).
4. Emergency సమయంలో (ఆర్టికల్ 352 ప్రకారం) ఆర్టికల్ 19 హక్కులు నిలిపివేయవచ్చు.

**ముఖ్యమైన కేసులు** (Landmark Cases)
కేసు పేరు సంవత్సరం తీర్పు / ప్రాముఖ్యత
Kesavananda Bharati vs State of Kerala (1973)
రాజ్యాంగం యొక్క "మూల నిర్మాణ సిద్ధాంతం" (Basic Structure Doctrine) స్థాపన.
Maneka Gandhi vs Union of India (1978)
ఆర్టికల్ 21 పరిధి విస్తరణ – జీవన హక్కు అంటే "జీవించటమే కాదు, గౌరవంగా జీవించడం" కూడా.
Indira Sawhney vs Union of India (1992 )
27% OBC రిజర్వేషన్, మొత్తం రిజర్వేషన్ 50% లోపే ఉండాలి అని తీర్పు.

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు (Fundamental Rights of the Indian Constitution)
భారత రాజ్యాంగం ప్రపంచంలోని అత్యంత విశాలమైన మరియు ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో ఒకటి. ఇందులో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛలు మరియు రక్షణ కల్పించే అనేక నిబంధనలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి ప్రాథమిక హక్కులు (Fundamental Rights). ఇవి భారత ప్రజలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం కల్పించడానికి రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి.

**ప్రాథమిక హక్కుల పరిచయం**

- ప్రాథమిక హక్కులు అంటే ప్రతి పౌరుడికి హామీ ఇవ్వబడిన స్వేచ్ఛలు,గౌరవం మరియు రక్షణలు. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిస్వాతంత్ర్యం, సమానత్వం, గౌరవప్రదమైన జీవనం మరియు చట్టపరమైన రక్షణను నిర్ధారిస్తాయి.
- భారత రాజ్యాంగంలోని భాగం-III (Part III) లోని ఆర్టికల్స్ 12 నుండి 35 వరకు ఈ హక్కులు పొందుపరచబడ్డాయి.
- ఈ హక్కులు ప్రధానంగా అమెరికా రాజ్యాంగం నుండి స్ఫూర్తి పొందాయి.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వీటిని "రాజ్యాంగ హృదయం మరియు ఆత్మ" (The Heart and Soul of the Constitution) అని పిలిచారు.

**ప్రాథమిక హక్కుల లక్ష్యాలు**

1. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పించడం.
2. మానవ గౌరవాన్ని కాపాడటం.
3. సామాజిక న్యాయాన్ని స్థాపించడం.
4. అధికార దుర్వినియోగాన్ని నివారించడం.
5. ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించడం.

అదనపు సమాచారం

- Article 31 సంపత్తి హక్కు తొలగించబడి Article 300A (Constitutional Right)గా చేర్చబడింది.
- ప్రాథమిక హక్కులు ఎన్నికల సమయంలో, అత్యవసర పరిస్థితుల్లో నిలిపివేయవచ్చు (Article 352).
- కొన్ని హక్కులు ప్రతీ వ్యక్తికి, కొన్ని కేవలం భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.



సత్య ఇగ్గదిండ్ల
SATYA SIR APP
9177323403

సూర్య

బుధవారం | అక్టోబర్ 22 | 2025

# ఎకానమి

## APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

**1. సమతౌల్యం /సమతౌల్యస్థితి అనే భావనకు అర్థం ఏమిటి?** (డి)

ఎ. కదల్లేని స్థితి, నిశ్చలస్థితి, స్థిరత్వం
బి. విరామస్థితి, మార్పులేని స్థితి, సమరూపత
సి. మార్పు కోరుకోని స్థితి, మార్పు అవసరం లేని స్థితి
డి. పైవన్నీ

**వివరణ :** సమతౌల్యత మూలం మొదటిసారిగా 1600-10లో నమోదు చేయబడినది. సమతౌల్యత యొక్క ఉపయోగం మొదట 1608లో జరిగింది. సమతౌల్యత భావన విభిన్న శాస్త్రముల సమ్మిళిత వినియోగితా భావన.

**సమతౌల్యం అర్థం :** సమతౌల్యం/ సమతౌల్యస్థితిని ఆంగ్లంలో ఈక్విలిబ్రియం అంటారు. ఈక్విలిబ్రియం అనేది లాటిన్ భాషలోని ఆక్విలిబ్రియమ్ నుండి ఉద్భవించినది. అర్థం సమాన సమతౌల్యం.

సమతౌల్యం అనే భావన వాస్తవంగా భౌతిక శాస్త్రాలకు చెందినది. అర్థశాస్త్రంలో దీని ఉపయోగం కొరకు భౌతికశాస్త్రం నుండి అరువు తెచ్చుకున్న భావన.

- భౌతికశాస్త్రంలో సమతౌల్యం అనేది ఒక వ్యవస్థ యొక్క స్థితి, దాని చలన స్థితి లేదా దాని అంతర్గత శక్తి స్థితి. ఇది కాలానుగుణంగా మారదు. సరళ త్వరణం లేదా కోణీయత్వరణం అనుభవించకపోతే ఒక సాధారణ యాంత్రిక శరీరం సమతౌల్యంలో ఉంటుందని చెప్పబడుతుంది.
- అర్థశాస్త్రంలో ప్రతి వస్తువు లేదా సేవ మొత్తం సప్లయి, మరియు డిమాండ్ సమానంగా ఉండే ఆర్థిక స్థితి. సమతౌల్యం అంటారు. కాని వాస్తవంగా ఎప్పటికీ ఇది సాధ్యం కాదు. ఇది మార్కెట్ శక్తుల కదలికల ద్వారా అంచనా వేయబడుతుంది.
- అర్థశాస్త్రంలో సమతౌల్యం/ సమతౌల్యస్థితి అనే భావనను అనేక సందర్భాలలో ఉపయోగించబడుతుంది. అందుకే ఆధునిక అర్థశాస్త్రాన్ని సమతౌల్య అర్థశాస్త్రమని, సమతౌల్య విశ్లేషణ అని కూడా అంటారు.
- అర్థశాస్త్రంలో సమతౌల్యం / సమతౌల్య స్థితి అంటే కదల్లేని స్థితి, విరామస్థితి, నిశ్చల స్థితి, మార్పు లేని స్థితి, మార్పు కోరుకోని స్థితి, మార్పు అవసరం లేని స్థితి. విశ్రాంత స్థితి, సంతులనం, స్థబ్దత అని అర్థం. ఈ సమతౌల్యస్థితిని వ్యక్తిపరంగా, సంస్థ పరంగా, పరిశ్రమ పరంగా సూచిస్తాం. అంటే వినియోగదారుని సమతౌల్యం, సంస్థ సమతౌల్యం, పరిశ్రమ సమతౌల్యం అంటూ అర్థశాస్త్ర అధ్యయనంలో ఈ భావనను ఉపయోగిస్తాం.
- వినియోగదారుడు తన పరిమితమైన ఆదాయంతో గరిష్ట సంతృప్తిని పొందే స్థితిని వినియోగదారుని సమతౌల్యం అంటారు.
- ఒక సంస్థ గరిష్ట లాభాలను ఆర్జించే స్థితిని సంస్థ సమతౌల్యం అంటారు.
- ఒక పరిశ్రమలోని సంస్థల సంఖ్య మారకుండా ఉండి, సంస్థలన్నీ సామాన్యలాభాలు పొందుతుంటే ఆ పరిశ్రమ సమతౌల్యస్థితిలో ఉందని చెప్పాలి.
- ఈ సమతౌల్య స్థితి ఏ పరిస్థితులలో ఏర్పడుతుందో అర్థశాస్త్రం విశ్లేషణ చేస్తుంది. అందుకే ఆధునిక అర్థశాస్త్రాన్ని సమతౌల్య విశ్లేషణ అని కూడా పిలుస్తారు.
- ఆర్థికవ్యవస్థ స్థితి అనేది మార్కెట్ శక్తుల మీద అంటే డిమాండ్, సప్లయిల మీద ఆధారపడి ఉంటుంది. అంటే డిమాండ్, సప్లయిలో మార్పు వస్తే ఆర్థిక వ్యవస్థ స్థితిలో కూడా మార్పు వస్తుంది.
- నిర్వచనం : ఆర్థిక శక్తులు కదలిక లేకుండా ఉన్న స్థితిని సమతౌల్యం / సమతౌల్యస్థితి అంటారు. డిమాండ్, సప్లయి వంటి మార్కెట్ శక్తులు/ ఆర్థిక శక్తులలో మార్పు లేకుండా ఉన్న స్థితి (సమతౌల్యం/ సమతౌల్య స్థితి అంటారు.


**సమతౌల్యం - రకాలు (టైప్స్ ఆఫ్ ఈక్విలిబ్రియం) :**

**ఎ.సి. పీగూ వర్గీకరణ :**

- సాధారణంగా సమతౌల్యస్థితి మూడు రకాలుగా ఉంటుంది అని ఎ.సి. పీగు వర్గీకరించారు.
  1. స్థిర సమతౌల్యం
  2. అస్థిర సమతౌల్యం
  3. తటస్థ సమతౌల్యం.

**1. స్థిర సమతౌల్యం (స్టేబుల్ ఈక్విలిబ్రియమ్) :** ఏ కారణం చేతనైనా ఒక స్థితి నుండి మార్పు చెంది, తిరిగి అదే స్థితిని చేరుకుంటే ఆ స్థితిని 'స్థిర సమతౌల్యం' అంటారు. స్థిర సమతౌల్యతకు అధిక ప్రాధాన్యత ఇచ్చినది మార్షల్.

**2. అస్థిర సమతౌల్యం (అన్ స్టేబుల్ ఈక్విలిబ్రియమ్) :** ఏ కారణం చేతనైనా ఒక స్థితి నుండి మార్పు చెంది, తిరిగి అదే స్థితిని చేరుకోకదూరంగా జరిగితే ఆ స్థితిని అస్థిర సమతౌల్యం అంటారు.




## సమతౌల్యం - రకాలు

అస్థిర సమతౌల్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినది వాల్రస్.

**3. తటస్థ సమతౌల్యం (న్యూట్రల్ ఈక్విలిబ్రియమ్) :**

- ఏ కారణం చేతనైనా ఒక స్థితి నుండి మార్పు చెంది, తిరిగి అదే స్థితిని చేరుకోక మరొక స్థితిలో సమతౌల్యాన్ని పొందితే దానిని తటస్థ సమతౌల్యం అంటారు. తటస్థ సమతౌల్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినది వాన్ హెయక్.

**మార్షల్ వర్గీకరణ :**

సమతౌల్య విశ్లేషణను అర్థశాస్త్రంలో విరివిగా ఉపయోగిస్తారు. కాలంతో పాటు సమతౌల్యం కూడా మార్పు చెందుతుంది. కావున సమతౌల్య స్థితిని స్వల్ప కాలిక సమతౌల్యం, దీర్ఘకాలిక సమతౌల్యం అని ఆల్ఫ్రెడ్ మార్షల్ రెండు రకాలుగా వర్గీకరించారు.

- **స్వల్పకాలిక సమతౌల్యం (షార్ట్ పీరియడ్ ఈక్విలిబ్రియమ్) :** వనరులను మార్పు చేయకుండా ఉన్న వనరులతో డిమాండ్‌కు అనుగుణంగా సప్లయిని మార్చడానికి పట్టే కాలాన్ని స్వల్పకాలం అంటారు. ఈ స్వల్పకాలంలో వనరులను పెంచడం గాని, తగ్గించడం గాని సాధ్యం కాదు. అంటే వనరులను మార్చకుండా/ ఉన్న వనరులతో స్వల్పకాలంలో ఏర్పడే సమౌల్యాన్ని స్వల్పకాలిక సమతౌల్యం అంటారు.
- స్వల్పకాలిక సమతౌల్యాన్ని తాత్కాలిక సమతౌల్యం అని కూడా అంటారు.

**దీర్ఘకాలిక సమతౌల్యం (లాంగ్ పీరియడ్ ఈక్విలిబ్రియమ్) :** డిమాండ్‌కు అనుగుణంగా వనరులను మార్చి సప్లయిని మార్చడానికి పట్టే కాలాన్ని 'దీర్ఘకాలం' అంటారు. దీర్ఘకాలంలో వనరులను పెంచవచ్చు, తగ్గించవచ్చు. ఇది శాశ్వతమైనది.

- సమతౌల్యాన్ని మరొకరకంగా సమగ్ర సమతౌల్యం, పాక్షిక సమతౌల్యం అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

**సమగ్ర సమతౌల్యం (జనరల్ ఈక్విలిబ్రియమ్) :** ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యం అనేది అనేక ఆర్థిక చలాంకాలకు సంబంధించినట్లయితే లేదా ఆర్థిక వ్యవస్థ మొత్తానికి సంబంధించినదైతే దానిని సమగ్ర సమతౌల్యం అంటారు.

ఉదా. : మొత్తం ఉత్పత్తి, మొత్తం ఉద్యోగిత, మొత్తం ఆదాయం, పొదుపు, సమిష్టి డిమాండ్, సమిష్టి సప్లయి.

- సమగ్ర సమతౌల్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినది వాల్రస్.

**పాక్షిక సమతౌల్యం (పార్షియల్ ఈక్విలిబ్రియమ్)** సమతౌల్యం అనేది ఒక ఆర్థిక చలాంకానికి సంబంధించినదైతే దానిని పాక్షిక సమతౌల్యం అంటారు.

ఉదా. : ఒక సంస్థ సమతౌల్యం, ఒక పరిశ్రమ సమతౌల్యం, ఒక వినియోగదారుని సమతౌల్యం.

పాక్షిక సమతౌల్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆర్థిక వేత్త మార్షల్

**2. ఆర్థిక ఏజెంట్లు (ఎకనామిక్ ఏజెంట్స్) :** మానవులు తమ కోరికలను తీర్చుకోవటానికి వివిధ ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొని, తమకు అవసరమైన ఆదాయాన్ని ఆర్జించటానికి ప్రయత్నించే వారందరినీ 'ఆర్థిక ఏజెంట్లు' అంటారు. అనగా ఉత్పత్తిదారులు, వినియోగదారులు, ప్రభుత్వం మొదలగువారు ఆర్థిక ఏజెంట్లు.

- అపరిమితంగా ఉన్న కోరికలను సంతృప్తి పరచు కోవటానికి పరిమితంగా ఉన్న ప్రత్యామ్నాయ ప్రయోజనాలు గల వనరులతో ఆర్థిక ఏజెంట్లు వివిధ రకాల ఆర్థిక కార్యకలాపాలను చేపడతారు.

**3. సంక్షేమం (వెల్ఫేర్) :**

- ఒక వ్యక్తి లేదా సమాజం సంపద నుండి పొందే సంతృప్తిని సంక్షేమం తెలియజేస్తుంది.
- సంక్షేమం వ్యక్తి/సమాజపు జీవన ప్రమాణాన్ని సూచిస్తుంది.
- సంక్షేమం వ్యక్తిగతమైనది.
- సంక్షేమాన్ని కొలవటానికి వీలుకాదు.
- సంక్షేమం వస్తురూపంలో గాని, సేవల రూపంలో గాని ఉండవచ్చు.
- ఆదాయాన్ని సమాజంలోని వివిధ వర్గాల మధ్య / ప్రజల మధ్య పంపిణీ చేయబడిన తీరుని బట్టి సంక్షేమం ఆధారపడి ఉంటుంది.

ఉదా. : వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్యశ్రీ, ఉచితవిద్య, భీమా సౌకర్యం.

**4. డంపింగ్ :**

ఒకే రకమైన వస్తువులను విదేశీ మార్కెట్లో తక్కువ ధరకు, దేశీయ మార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయించడాన్ని 'డంపింగ్' అంటారు.

- విదేశీ మార్కెట్లో వ్యాకోచ డిమాండ్ కారణంగా తక్కువ ధర, స్వదేశీ మార్కెట్లో అవ్యాకోచ డిమాండ్ కారణంగా ఎక్కువ ధర నిర్ణయించబడుతుంది.

**5. వినియోగదారుని మిగులు-భావన (కాన్సెప్ట్ ఆఫ్ కన్స్యూమర్స్ సర్ప్లస్ :**

వినియోగదారుని మిగులు అనే భావనను మొదటిసారిగా 1844లో డ్యూపిట్ అనే ఫ్రెంచి ఇంజనీరు ఆర్థికవేత్త ప్రతిపాదించాడు. (ఒక నదిపై వంతెనను నిర్మించడం వల్ల ప్రజలు పొందే ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని భావనను తెలిపారు)

- తరువాత మార్షల్ 'ప్రిన్సిపల్ ఆఫ్ ఎకనామిక్స్' (ఆర్థిక సూత్రాలు) అనే గ్రంథంలో ఈ భావనను అభివృద్ధి చేసారు. దీనిని అభివృద్ధి చేసేటపుడు మార్షల్ క్రమక్షీణోపాంత ప్రయోజన సూత్రాన్ని ఆధారంగా తీసుకున్నారు.
- ఆ తరువాత జాన్ రిచర్డ్ హిక్స్ తాను రాసిన వాల్యూ & కాపిటల్ (విలువ మరియు మూలధనం) అనే గ్రంథంలో వినియోగదారుని మిగులు భావనను ఉదాసీనత వక్రరేఖ విశ్లేషణ ద్వారా వివరించారు.

వినియోగదారుడు తన దైనందిన జీవితంలో అనేక వస్తువులను కొంటుంటాడు. కొన్ని వస్తువుల విషయంలో అతడు ఆ వస్తువుకు చెల్లించిన ధర కంటే ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతాడు. అంటే వినియోగదారుడు ఒక వస్తువుకు చెల్లించే ధర, తాను చెల్లించడానికి ఇష్టపడే ధర కంటే తక్కువగా ఉంటుంది. అందువల్ల అదనపు ప్రయోజనాన్ని పొందుతాడు. ఈఅదనపు ప్రయోజనాన్ని 'వినియోగదారుని మిగులు' అంటారు.

- ఉదా. : ఉప్పు, అగ్గిపెట్టె, వార్తాపత్రిక మొదలగు వాటికి చెల్లించే ధర కంటే వాటినుండి పొందే ప్రయోజనం అధికంగా ఉంటుంది. ఈ అదనపు ప్రయోజనాన్ని 'వినియోగదారుని మిగులు' అంటారు. వినియోగదారుడు ఒక వస్తువును చెల్లించడానికి ఇష్టపడే ధరకు-వాస్తవంగా చెల్లించే ధరకు మధ్యగల తేడాయే వినియోగదారుని మిగులు.
- వినియోగదారుని మిగులు = చెల్లించడానికి ఇష్టపడే ధర - వాస్తవంగా చెల్లించిన ధర

ఒక వస్తువును కొనుట, మానుట కన్నా దానికి చెల్లించడానికి ఇష్టపడిన ధరకు వాస్తవంగా దానికి చెల్లించిన ధరకు గల తేడాయే వినియోగదారుని మిగులు' అని మార్షల్ నిర్వచించారు.



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

THE UNITED NATIONS

# విశ్వశాంతి సాధనలో... ఐక్యరాజ్యసమితి

**అక్టోబర్ 24 ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా**

**అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పాటు చేసిన నానాజాతి సమితి రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫల మగుటచే దానికి ప్రత్యామ్నాయముగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించబడింది.**

ప్రస్తుతము 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతామండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళకోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా, మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా , ఫ్రాన్స్. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. ఐక్యరాజ్య సమితి స్థాపించబడిన అక్టోబరు 24వ తేదీని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తారు. యునైటెడ్ నేషన్స్ అనే పదాన్ని మొదటిగా అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి, రూజ్వెల్ట్ సూచించారు. ఐక్యరాజ్య సమితి రాజ్యాంగ ప్రవేశిక ముసాయిదాను జాన్ క్రిస్టియన్ రూపొందించారు, ఈయన దక్షిణా ఆఫ్రికాకు చెందిన వారు.

**ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం:-**

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు థియోడార్ రూజ్‌వెల్ట్ , బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావేశమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధభయాన్ని తొలగించడం, శాంతిని నెలకొల్పడం, నిరాయుధీకరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది.

తరువాత 1944లో వాషింగ్టన్ లోని డంబార్టన్ ఓక్స్ వద్ద జరిగిన సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా ప్రతినిధులు ఐ.రా.స. ప్రకటన పత్రం ముసాయిదాను తయారు చేశారు. 1945ఫిబ్రవరిలో యాల్టా సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా నేతలు ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించాలని తీర్మానం చేశారు. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమావేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్ నగరంలో ఐక్యరాజ్యసమితి లాంఛనంగా ప్రారంభమైంది.

**ఐక్యరాజ్యసమితి ఆశయాలు:-**

- యుద్ధాలు జరగకుండా చూడటం,
- అంతర్జాతీయ తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం,
- దేశాల మధ్య స్నేహసంబంధాలను పెంపొందించడం,
- అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం,
- సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం.

**ఐక్యరాజ్యసమితి ప్రధాన అంగాలు :-**

ఐక్యరాజ్యసమితి ప్రధాన అంగాలు ఆరు అవి.

**1.సర్వ ప్రతినిధి సభ:-**

ఈ సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతి దేశానికి సమానంగా ఒక్క ఓటు ఉంటుంది. సమావేశాలకు ప్రతి సభ్యదేశం గరిష్ఠంగా 5 గురు సభ్యులను పంపవచ్చు. ఈ సభ సంవత్సరానికి ఒక పర్యాయం, సాధారణంగా సెప్టెంబరు మాసంలో, సమావేశమౌతుంది. సమావేశానికి అధ్యక్షుడిగా సభ్యదేశాలు ఎన్నిక చేస్తాయి. కొత్త సభ్యదేశాలకు ప్రవేశం కల్పించడానికి, భద్రతామండలిలో తాత్కాలిక సభ్యదేశాలను ఎన్నిక చేయుటలో ఈ సభకే అధికారముంది. సమితి ఆశయాలకు, లక్ష్యాలకు వ్యతిరేకంగా వ్యవహరించే సభ్యదేశాలను తొలగించే అధికారం కూడా ఈ సభకు ఉంది. అన్ని రంగాలలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం దీని కర్తవ్యం. ఈ సభ మూడింట రెండు వంతులు (2/3) మెజారిటీతో నిర్ణయాలు చేస్తుంది.(సాధారణ సభను ప్రపంచ పార్లమెంట్ అని కూడా అంటారు.)

**2.భద్రతా మండలి :-**

సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల



సంఖ్య 11. ప్రస్తుతం 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్యదేశాలు కాగా 10 రెండేళ్ళ కాలవ్యవధి కొరకు ఎన్నికకాబడు తాత్కాలిక సభ్యదేశాలు. అమెరికా, రష్యా, ఇంగ్లాండు, చైనా, ఫ్రాన్సులు ఇందులో శాశ్వత సభ్యదేశాలు. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం కూడా ఉంది. సమితి ప్రారంభమైనప్పటి నుంచి ఇందులో ప్రధానమైన రెండు మార్పులు చేసారు. ప్రారంభంలో 6 తాత్కాలిక సభ్యదేశాలుండగా దాని సంఖ్యను 10 కి పెంచారు. వీరిలో ఆసియా-ఆఫ్రికా దేశాలనుండి ఐదుగురు, లాటిన్ అమెరికా దేశాలనుండి ఇద్దరు, పశ్చిమ ఐరోపా నుండి ఇద్దరు, తూర్పు ఐరోపానుండి ఒక్కరు ఎన్నికవుతుంటారు. నేషనలిస్ట్ చైనా స్థానంలో కమ్యూనిస్ట్ చైనాకు శాశ్వత సభ్యత్వం కల్పించారు. తాత్కాలిక సభ్యదేశాలను సాధారణ సభ ఎన్నిక చేస్తుంది. ఏ దేశం కూడా వరుసగా రెండు పర్యాయాలు ఎన్నిక కారాదు. దీనికి అధ్యక్షుడు ప్రతి మాసము మారుతుంటాడు. భద్రతా మండలి తన ఆదేశాలను పాటించని రాజ్యాలపై ఆంక్షలు విధిస్తుంది. సైనిక చర్య కూడా చేపట్టే అధికారముంది.

**3. సచివాలయం:-**

ఇది ఐ.రా.స. వ్యవహారాలు నిర్వహించే కార్య నిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. ఇందులో పది వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తారు. సచివాలయానికి ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు. ఐ.రా.స.కీ, దాని వివిధ విభాగాలకు, అనుబంధ సంస్థలకు అవుసరమైన సమాచారము, అధ్యయనం, సదుపాయాలు వంటి విషయాలు సచివాలయం అధ్వర్యంలో నిర్వహింప బడుతాయి. ఉద్యోగుల ప్రతిభ, నిజాయితీ, పనితనం , వివిధ ప్రాంతాలకు ఉచితమైన ప్రాతినిధ్యం అనే అంశాలు ఈ ఉద్యోగుల ఎంపికలో ముఖ్యమైన విషయాలని ఐ.రా.స. ఛార్టర్‌లో వ్రాయబడింది. ఐ.రా.స శాంతి సైనిక దళాలను Blue helmets అంటారు.

**4.ధర్మ కర్తృత్వ మండలి:-**

కొన్ని పాశ్చాత్య దేశాల వలస పాలన క్రింద కొన సాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడడం ఈ మండలి లక్ష్యం. ఇక్కడి ప్రజలను స్వీయ ప్రతిపత్తికి లేదా స్వయంపాలనకు లేదా స్వాతంత్ర్యానికి సిద్ధం చేయడం ఈ మండలి బాధ్యత. ఇది సంవత్సరానికి రెండు సార్లు సమావేశమవుతుంది. ఇందులో మూడు రకాల సభ్యత్వాలు ఉన్నాయి. ధర్మ కర్తలుగా కొన్ని దేశాలను పాలిస్తున్న దేశాలు, భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగిన దేశాలు, మూడేళ్ళ కాల పరిమితికి ఎన్నికైనవి.

**5.ఆర్థిక, సాంఘిక మండలి:-**

ఇది సాధారణ సభ అధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ఈ మండలి ఏటా రెండుసార్లు సమావేశమవుతుంది. ప్రజల జీవన స్థాయిని మెరుగు పరచడం, విద్య, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేయడం, మానవ హక్కులను సమర్థించడం వంటివి ఈ మండలి ఆశయాలు.

**6.అంతర్జాతీయ న్యాయస్థానం:-**

అంతర్జాతీయ న్యాయస్థానం (సాధారణంగా "ప్రపంచ న్యాయస్థానం"గా పిలువబడుతుంది). ఇది ఐక్యరాజ్య సమితి యొక్క ప్రాథమిక తీర్పులను ప్రకటించే అంగము. దీని కేంద్రం నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధంలో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్య దేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అంతర్జాతీయ న్యాయ స్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ ప్రపంచ పరిధి ఉంది. 1945లో ఐక్యరాజ్యసమితి చార్టర్ ఆధారంగా స్థాపించబడింది. 1946 నుండి పనిచేయడం ప్రారంభించింది. ఇది పర్మనెంటు కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ జస్టిస్ వారసురాలు.

**ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు:-**

ప్రత్యేక ఒప్పందాల ద్వారా ఏర్పడిన ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్యా, వైద్య రంగాలలో పనిచేస్తుంటాయి. ఐక్య రాజ్య సమితి అంగాలలో ఒకటైన "ఆర్థిక, సామాజిక మండలి" ఈ అనుబంధ సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తుంది.

**ఐక్య రాజ్య సమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ - యునెస్కో** (UNESCO) :

ఈ సంస్థను 1946 నవంబరు 4 న స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం పారిస్లో ఉంది. విద్య, విజ్ఞానం, సంస్కృతి రంగాలలో అంతర్జాతీయ సహకారానికి, ప్రగతికి, శాంతియుత సంబంధాలకు ఈ సంస్థ కృషి చేస్తుంది. దీని ప్రధాన అంగాలు మూడు, ఇవి తన పాలసీల తయారీ కొరకు, అధికార చెలామణి కొరకు, , దైనందిన కార్యక్రమాలకొరకు పాటుపడుతాయి. (1) సాధారణ సభ (జనరల్ కాన్ఫరెన్సు) (2) కార్యనిర్వాహక బోర్డు (ఎక్సిక్యూటివ్‌బోర్డు)(3) మంత్రాలయం (సెక్రటేరియట్) - కార్యనిర్వాహక బోర్డు, సాధారణ సభచే నాలుగేండ్లకొరకు ఎన్నుకోబడుతుంది. మంత్రాల యం, దైనందిన కార్యక్రమాలను, దీని పరిపాలనా బాధ్యతలను చేపడుతుంది. దీని డైరెక్టర్ జనరల్ నాలుగేండ్ల కాల పరిమితికి ఎన్నుకోబడతాడు. దీనిలో 2100మంది సిబ్బంది ఉంటారు. మూడింట రెండువంతు సిబ్బంది పారిస్ లోనే తమ కార్యక్రమాలను నిర్వహిస్తారు. మిగతా వారు ప్రపంచంలోని పలు దేశాలలో గల యునెస్కో కార్యాలయాలలో తమ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాలు పెంచ డానికి కావలసిన శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధిని యునెస్కో ప్రధానంగా ప్రోత్సహిస్తుంది. ఇందుకోసం న్యూఢిల్లీ, కైరో, జకార్తా, మాంటెవిడియో, వెనిస్ లలో కార్యాలయాలున్నాయి. ప్రస్తుతం యునెస్కోలో 192 దేశాలకు సభ్యత్వం ఉంది.

**ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి లేదా ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి- యునిసెఫ్** (UNICEF) :-

1946 డిసెంబరు 11న ఈ సంస్థ ఏర్పాటైంది. ప్రధాన కార్యాలయం న్యూయార్కు నగరంలో ఉంది. ప్రస్తుతం దీని పేరులో "అంతర్జాతీయ ", "అత్యవసర " అనే పేర్లను తొలగించి ఐక్య రాజ్య సమితి బాలల నిధి అని వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పిల్లలు, వారి తల్లుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ఈ సంస్థ కృషి చేస్తున్నది.

**ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం** - (UNDP):

ఈ సంస్థ 1965 నవంబరు 22న స్థాపించబడింది. ప్రధాన కార్యాలయం న్యూయార్కు నగరంలో ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు వాటి సంపదను వృద్ధి చేసుకొనేందుకు అవుసరమైన శిక్షణ, వైజ్ఞానిక సహాయ కార్యక్రమాలకు ఈ సంస్థ నిధులు సమకూరుస్తుంది. 1990 నుండి యు.ఎన్.డి.పి. యేటా మానవాభివృద్ధి నివేదికను విడుదల చేస్తున్నది.

**ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం** (UNEP) :

స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్లో 1972 జూన్ 5న నిర్వహించిన పర్యావరణ సద స్సు ఫలితంగా యు.ఎన్.ఇ.పి. రూపు దిద్దుకొంది.

**(మిగతా వచ్చేవారం...)**

**నరేష్ జాటోత్ .**
**రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు.**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల,**
**రామన్నపేట**



APPSC,TGPSC
UPSC CIVIL SERVICES
EXAMS SPECIAL

# భారత దేశంలో స్థానిక ప్రభుత్వాలు

(గత వారం తరువాయి...)

గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారిని గ్రామ కార్యదర్శి లేదా పంచాయతీ కార్యదర్శి అని పిలుస్తారు. గ్రామస్థాయిలో ఈ అధికారి ప్రభుత్వ ఏజెంట్గా పనిచేస్తూ, గ్రామస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలుచేయడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 మరియు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం – 2018లో పంచాయతీ కార్యదర్శి విధులు, అధికారాల గురించి ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ పరిధిలోనే నివాసం ఉండాలి అదేవిధంగా గ్రామ పంచాయతీ ఆధీనంలోనే పనిచేయాలి.

**పాలనాపరమైన విధులు:**

1. ప్రకృతి వైపరిత్యాలు వంటివి సంభవించినప్పుడు సహాయక చర్యలలో సంబంధిత అధికారులకు సహాయపడటం
2. అంటువ్యాధులు వ్యాప్తి చెందినప్పుడు ఆ సమాచారాన్ని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెలియచేయడం, అదేవిధంగా వాటి నివారణకు చర్యలు చేపట్టడం
3. అంటరానితనం వంటి సాంఘీక దురాచారాల గురించి పౌరులను చైతన్యపరచడం


**సామాజిక అభివృద్ధికి సంబంధించిన విధులు**

1. వృద్ధాప్య పెన్షన్ల పంపిణీ విషయంలో సంబంధిత అధికారులకు సహకరించడం
2. దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాల వారి సమగ్ర సమాచారాన్ని సేకరించడం.
3. స్వయం సహాయక సంఘాల ఏర్పాటులో మహిళలకు సహాయపడి పొదుపు కార్యక్రమాలకు సహకారాన్నిందించడం
4. గ్రామ పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి, ఇతర కార్యక్రమాల అమలుకు సంబంధించిన సమాచార సూచికలను ఏర్పాటు చేయడం.
5. ఇతర ప్రభుత్వ శాఖలు గ్రామస్థాయిలో అమలు పరుస్తున్న కార్యక్రమాల అమలు సందర్భంలో విధిగా సహకారాన్ని అందించి సామాజికాభివృద్ధికి తోడ్పడటం

**సమన్వయకర్తగా విధులు**

1. లబ్దిదారుల జాబితాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం పెరిగే విధంగా చర్యలు తీసుకోవడం
2. సాముహిక కార్యక్రమాల్లో పాల్గొనుటకుగాను ప్రజలను చైతన్యపరచడం
3. ప్రజారోగ్యం రిత్యా వివిధ హోటళ్ళు, షాపులను, ఇతర వాణిజ్య సముదాయాలను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవడం.
4. ప్రైవేటు మార్కెట్లను తనిఖీచేసి ప్రజల భద్రత సౌకర్యాల మెరుగుకోసం సూచనలు, ఆదేశాలను జారీచేయడం
5. అంగన్వాడి కార్యకర్త తరుచూ గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, మహిళలకు వ్యాది నిరోధక టీకాలు, ఆరోగ్య తనిఖీలు చేయడంలో ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పనిచేయడం

పంచాయతీ కార్యదర్శి గ్రామస్థాయిలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో క్రియాశీల పాత్ర పోషించడం వల్ల ఈ అధికారి సమర్థత, నైపుణ్యం, సృజనాత్మకత పథకాల అమలుపై కనపడుతుంది. గ్రామ



The Functions of the Panchayat Samiti

పంచాయతీ సమావేశాల ఎజెండా తయారీ మొదలు ఆదాయ, వ్యయాలను పద్ధతి ప్రకారం క్యాష్ బుక్లో నమోదు చేయడం, బడ్జెట్ రూపకల్పన వంటి అనేక ఆర్థిక సంబంధ అంశాలలో కూడా పంచాయతి సెక్రటరీ పాత్ర మరియు ప్రభావం ప్రత్యక్షంగా కనపడుతుంది.

పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామ స్వరాజ్య సాధనలో ఒక మైలురాయిగా పరిగణించబడుతుంది. ప్రజాస్వామ్యం లో ప్రజలకొరకు, ప్రజలచేత, ప్రజల యొక్క ఆలోచనాలకు, అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రజలు తమను తాము పరిపాలించుకోవడం సర్వసాధారణంగా కనపడుతుంది. స్థానిక సంస్థలు ఈ అవకాశాన్ని కల్పించగలిగాయి. దీని ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మహిళలకు రాజకీ సాధికారత లభించడం వల్ల ఈ వర్గాల సమస్యలు చాలా వరకు పరిష్కరిచబడ్డాయి. అయితే చట్టంలో పేర్కొన్న అన్ని అధికారాలను, విధులను నిధులను పంచాయతీలకు బదిలీ చేయడం, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యాన్ని కొంత వరకు తగ్గించగలిగితే స్థానిక సంస్థలు గ్రామ వికాసానికి నిజమైన ప్రతీకలుగా మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

పారిశుద్ధ్యంలో గ్రామ పంచాయతీల విధులు: పరిసరాల పరిశుభ్రతే పారిశుద్ధ్యం, పారిశుద్ధ్యం 7 అంశాల పై ఆధారపడి ఉంటుంది.

- త్రాగునీరు
- మురికినీరు
- మలమూత్రాదుల విసర్జన
- పశువుల పేడ, చెత్త
- గృహపారిశుద్ధ్యం
- వ్యక్తిగత శుభ్రత
- గ్రామ పారిశుద్ధ్యం.

పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోతే డయేరియా, కలరా, మలేరియా, హెపటైటిస్, టైఫాయిడ్, నులిపురుగులు, చికున్గున్యా లాంటి వ్యాధులు సంభవిస్తాయి. గృహముల నుండి మరియు వీధులలో సేకరించిన చెత్తలను నిర్ణీత ప్రాంతాలలో వేయించి కంపోస్టు తయారుచేయించడం. పశువుల పేడ, చెత్తతో గ్రామస్తులు కంపోస్టు ఎరువు తయారుచేసుకొనే విధంగా ప్రోత్సహించడం. యూజర్ కమిటీలను ప్రోత్సహించి త్రాగు నీటి వసతుల వద్ద, వాటి పరిసరాల వద్ద పారిశుద్ధ్యాన్ని తప్పనిసరిగా పాటించేటట్లు చర్యలు తీసుకోవడం. మురికి గుంటలను, పూడ్చిం చడము, మురికి నీటిని తొలగించడం, మురికినీరు నిలువ వున్న చోట్ల ఆయిల్ బాల్సు, ఫినాయిల్ వేసి దోమలను నిర్మూలించడం. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని దారిద్ర్యరేఖకు దిగువనవున్న కుటుంబాలకు మరుగు దొడ్లను సబ్సీడి పై నిర్మించడం, మిగిలిన కుటుంబాల వారు స్వంతంగా నిర్మించుకొని వినియోగించుకొనేటట్లు ప్రోత్సహించడం, బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా చేయడం.

భూగర్భ జలాలను అభివృద్ధి పరచడానికిగాను ప్రభుత్వ పథకాలైన వాటర్ షెడ్, ఉపాధిహామీ కార్యక్రమం వంటి వాటిని అనుసంధానం చేసి భూగర్భ జలాల స్థాయిని పెంచడం. గ్రామ నీటి వనరులకు మరమ్మతులను చేయడం, నీటి పంపిణిలలోని లోపాలను సరిదిద్ది గ్రామంలోని అన్ని వార్డులకు వంతులవారి త్రాగునీటి సరఫరా చేయడం.

ప్రతిపాయింటు వద్ద కుళాయిలు బిగించడము. త్రాగు నీటిని ఇతర అవసరాలకు వినియోగించకుండా చూడటం, బోర్వెల్స్ చుట్టూ మురుగునీరు చేరకుండా ప్లాట్ఫామ్లు నిర్మించడం, బట్టలు ఉతకడం, పశువులను కడగటం వంటి పనులను నివారించడం

నేటికి భారతదేశంలో 68 శాతం పైబడి జనాభా గ్రామాలలోనే నివసిస్తున్నారు.

గ్రామీణాభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని భావించి ఆదేశ సూత్రాలలోని నిబంధన 40 గ్రామ పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేయడం జరిగింది. గ్రామీణాభివృద్ధికి ఆర్థిక స్వావలంభన, రాజకీయ స్వయంపాలన అనివార్యమని గ్రహించి తదనుగుణంగా ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అనేక కార్యక్రమాలు సత్ఫలిస్తున్నాయి. అయితే జరగాల్సిన ప్రగతి చాలా ఉంది.

అందువల్ల పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన అధికారాలను బదిలీ చేయడంతోపాటు తగిన స్థాయిలో ఆర్థిక వనరులను అందించడంతోపాటు, స్థానిక స్వపరిపాలనకు పూర్తిస్థాయి మద్దతును కల్పించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైన ఉందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

Dr. P. Harish,
Director
Perfect Academy,
Hyderabad.



## రచనలకు ఆహ్వానం

**పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.**

## రైల్వేలో 8,050 పోస్టులు భర్తీ



రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ఆర్బీ) నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ కింద గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ ప్రకటన విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 8,050 పోస్టులను భర్తీ చేస్తారు. ఇందులో గ్రాడ్యుయేట్ పోస్టులు 5 వేలు, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు 3,050 వరకు ఉన్నాయి. ఈ పోస్టులకు ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభం అయ్యాయి. గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 21 నుంచి, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 28 నుంచి దరఖాస్తులు ప్రారంభం అవుతాయి.

**ఏఏ పోస్టులు....** గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టుల్లో గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్-కమ్-టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్-కమ్-టైపిస్ట్, చీఫ్ కమర్షియల్-కమ్-టికెట్ సూపర్వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్-కమ్-టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్-కమ్-టైపిస్ట్, జూనియర్ క్లర్క్-కమ్-టైపిస్ట్, రైళ్ల క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు.

**అర్హతలు..** ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.

**వయసు..** అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు 18 నుంచి 38 ఏళ్లు, గ్రాడ్యుయేట్ పోస్టులకు 16 నుంచి 33 ఏళ్ల వరకు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

గ్రాడ్యుయేట్ పోస్టులకు నవంబర్ 20, 2025, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు నవంబర్ 27, 2025వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది ఇతర వివరాలు ఆర్ఆర్బీ అధికారిక వెబ్సైట్ https://www. rrbapply.gov.in/లో చెక్ చేసుకోవచ్చు.

## డియస్సీ గ్రూప్-1, గ్రప్-2 జె.ఎల్.,

# తెలంగాణ జాగ్రఫీ



(గత వారం తరువాయి...)

**16. క్రింది వాటిని జతపరుచుము.**

| అటవీ ఉత్పత్తి | జిల్లా |
|---|---|
| 1. రూసా గడ్డి | ఎ. మెదక్ |
| 2. కాగితం - రేయాన్ | బి. నల్గొండ |
| 3. తాటిచెట్టు | సి. ఆదిలాబాద్ |
| 4. గంధపు చెట్లు | డి. నిజామాబాద్ |

1. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
2. 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
3. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
4. 1-సి, 2-ఎ, 3-బి, 4-డి

**17. పోనికి కర్రతో కొయ్యబొమ్మలను తయారు చేయటాన్ని ఏమని పిలుస్తారు?**

1. పార్నిస్ 2. నక్కాష్
3. ఇద్రిస్ 4. వెర్నియస్

**18. క్రింది వాటిని పరిశీలింపుము**

ప్రతిపాదన (ఎ) - ఆకురాల్చే అడవులను ఋతుపవన ప్రాంతపు అరణ్యాలు అని పిలుస్తారు.

కారణం (ఆర్) - వేసవి కాల ఆరంభంలో భాష్పోత్సేక ప్రక్రియను నియంత్రించడానికి ఈ అడవుల వృక్షాలు తాత్కాలికంగా ఆకులను రాలుస్తాయి.

1. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఆర్), (ఏ)కు సరైన వివరణ
2. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే, కాని (ఆర్), (ఏ)కు సరైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాదు (ఆర్) నిజమైనది.
4. (ఎ) నిజమైనది (ఆర్) నిజమైనది కాదు.

**19. దేవాలయాలు, దర్గాలు, చర్చిల దగ్గర స్థానిక ప్రజల చేత సంరక్షించబడే చిన్న అటవీ ప్రదేశాలు ఏవి?**

1. హరిత పాఠశాల
2. హరిత తెలంగాణ
3. సామాజిక అడవుల పెంపక కార్యక్రమం
4. పవిత్ర అటవీ ప్రదేశాలు.

**20. క్రింది వాటిని జతపరుచుము**

| | |
|---|---|
| 1. పసుపు తయారీ కేంద్రం | ఎ. ఏటూరి నాగారం |
| 2. సబ్బుల తయారీ కేంద్రం | బి. నిర్మల్ |
| 3. తేనె శుద్ధి కేంద్రం | సి. కామారెడ్డి |
| 4. జిగురు శుద్ధి కేంద్రం | డి. ములుగు |

1. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
2. 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
3. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
4. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ

**21. కోతులు వాపసు పోవాలె వానలు వాపసు రావాలె అనే నినాదం దేని ద్వారా వచ్చింది?**

1. హరితహారం
2. హరిత పాఠశాల
3. హరిత తెలంగాణ
4. సామాజిక అడవుల పెంపక కార్యక్రమం

**22. గ్రీన్ డే గా ఎప్పుడు పాటించాలని నిర్ణయించారు?**

1. 2017 జూన్ 05 2. 2017 జులై 15
3. 2017 మార్చి 21 4. 2017 జూన్ 21

**23. క్రింది వానిలో సరియైన అంశాలను పరిశీలింపుము**

ఎ. హరితహారం పథకం 6వ విడత కార్యక్రమం 2020 జూన్ 25వ తేదీన ప్రారంభించారు.

బి. ఈ కార్యక్రమం మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ప్రారంభించారు.

సి. ఈ కార్యక్రమ నినాదం జంగిల్ బచావో-జంగిల్ బడావో

డి. ఈ కార్యక్రమ నినాదం అడవిని కాపాడుదాం - అడవిని విస్తరిద్దాం.

1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి మరియు డి

**24. క్రింది వాటిని జతపరుచుము**

| | |
|---|---|
| 1. సోయా ప్రాసెసింగ్ యూనిట్ | ఎ. ఉట్నూర్ |
| 2. చింతపండు ప్రాసెసింగ్ | బి. కొండనాగుల |
| 3. షాంపూ తయారీ కేంద్రం | సి. నాగర్ కర్నూల్ |
| 4. సుగంధ నూనె తయారీ | డి. నిజామాబాద్ |

1. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
2. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
3. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
4. 1-బి, 2-డి, 3-ఎ, 4-సి



**25. క్రింది వానిలో సరికానిది ఏది?**

1. రిజర్వ్ & అన్‌రిజర్వ్ ఫారెస్ట్ - అటవీ అధికారుల ఆధీనంలో
2. రిజర్వ్ ఫారెస్ట్ - ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది.
3. రక్షిత ఫారెస్ట్ - ప్రభుత్వ పరిరక్షణలో ఉంటుంది.
4. వర్గీకరించబడని ఫారెస్ట్ - ఈ అడవులలో చెట్లు నరకడానికి ఏ మాత్రం ఆటంకం లేదు.

**జవాబులు :**

16)3, 17)2, 18)1, 19)4, 20)3, 21)1, 22)2, 23)4, 24)3, 25)1

- తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే 2014-15 ప్రకారం రాష్ట్రంలో 26,969 చ.కి.మీ. విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి
- ఇది రాష్ట్ర భూ భాగంలో 24.07%.
- దేశ అటవీ విస్తీర్ణంలో రాష్ట్ర అటవీ విస్తీర్ణం 4.22%.
- అడవి విస్తీర్ణం పరంగా రాష్ట్రం 13వ స్థానంలో ఉంది.
- తెలంగాణలో ప్రధానంగా మూడు రకాల అడవులు విస్తరించి ఉన్నాయి.

**1. ఆర్ద్ర ఆకురాల్చే అడవులు :**

- 100 సెం.మీ. నుండి 200 సెం.మీ. వర్షపాతం గల ప్రాంతాలు
- రకాలు : వేగి, మద్ది, జిట్రేగి
- ప్రాంతాలు: ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్

**2) శుష్క ఆకురాల్చే అడవులు :**

- 70 సెం.మీ. నుండి 100 సెం.మీ. మధ్య వర్షపాతం ఉండే ప్రాంతాలు.
- రకాలు : వెలగ, ఏగిస, వేప, టేకు, దిరిసెన, బూరుస, వెదురు.
- ప్రాంతాలు : వరంగల్, మెదక్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి.

**3) ముళ్ళతో కూడిన పొదలు లేదా చిట్టడవులు :**

- 70 సెం.మీ. కంటే తక్కువగా వర్షపాతం ఉండే ప్రాంతాలు.
- రకాలు : తుమ్మ, రేగి, మొగిలి, తంగేడు
- ప్రాంతాలు : నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్
- నిజమాబాద్ జిల్లా అడవుల్లో రూసాగడ్డి లభిస్తుంది. దీనిని సుగంధ పరిమళ తయారీలో ఉపయోగిస్తారు.
- శ్రీగంధం చెట్లు మెదక్ జిల్లాలో పెరుగుతున్నాయి. దీని తైలాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మన దేశంలో పరిమళ ద్రవ్యాల తయారీకి దీన్ని ఉపయోగిస్తున్నారు.
- తెలంగాణలో అధికంగా ఆకురాల్చు అడవులు ఉన్నాయి.
- తెలంగాణ అటవీ పరిశోధన కళాశాల - ములుగు (సిద్దిపేట)



**పాదం సుధాకర్**
ఫ్యాకల్టీ:9849972622

## SSC, RRB, PSC Police, Bank Exams — REASONING ANALOGY

1Q. Select the related word from the given alternatives. Goldsmith : Gold : : ?
(A)Barber : Shave
(B)Cobbler : Shoes
(C)Jeweler : Jewelry
(D)Carpenter : Wood
Solution: (D) Carpenter : Wood
Explanation: A goldsmith works with gold; a carpenter works with wood.

2Q. Select the related word from the given alternatives. Druggist : Pharmacy : : ?
(A) Librarian : Catalogue
(B) Chef : Restaurant
(C) Carpenter : Wood
(D) Physician : Patient
Soultion: (B) Chef : Restaurant
Explanation:A druggist works in a pharmacy; a chef works in a restaurant.

3Q. Car : Garage : : Aeroplane : ? Select the related word from the given alternatives.
(A) Hangar
(B) Airhostess
(C) Flying
(D) Landing
Solution: (A) Hangar
Explanation:A car is kept in a garage; an aeroplane is kept in a hangar.

4Q. Select the related word from the given alternatives. Cruel : Kind : : Humility : ?
(A) Simple
(B) Self - effacing
(C) Arrogance
(D) Weakness
Solution: (C) Arrogance
Explanation:Kind is the opposite of cruel; arrogance is the opposite of humility.

5Q. Select the related word from the given alternatives. Gold : Goldsmith : : Leather : ?
(A) Butcher
(B) Tanner
(C) Dyer
(D) Cobbler
Solution: (B) Tanner
Explanation:A goldsmith works with gold; a tanner processes leather.

6Q. Select the related word from the given alternatives. Doctor : Hospital : : Chef : ?
(A) Food
(B) Knife
(C) Kitchen
(D) Cook
Solution: (C) Kitchen
Explanation:A doctor works in a hospital; a chef works in a kitchen.

7Q. Select the related word from the given alternatives. Hen : Egg : : Tree : ?
(A) Seed
(B) Bark
(C) Leaves
(D) Fruit
Solution: (A) Seed
Explanation:A hen produces an egg; a tree produces a seed.

8Q. Select the related word from the given alternatives. Nail Cutter : Nail : : Gillet : ?
(A) Razor
(B) Knife
(C) Blade
(D) Head
Solution: (D) Head
Explanation:A nail cutter is used to cut nails; a Gillette razor is used to shave the head or face.



Dr. M.Reddi Ramu,
Professor, Viswam Engineering College (Autonomous),
Madanapalli

# అంతర్జాతీయం

**అక్టోబరు 13 - అక్టోబరు 19**

- ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్‌కు చెందిన మిగిలిన 20 మంది బందీలను హమాస్ విడుదల చేసింది.
- మడగాస్కర్‌లో యువత పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి, ప్రెసిడెంట్ ఆండ్రీ రజోలినాకు వ్యతిరేకంగా ఉద్యమించారు.
- గాజాలో శాంతిని నెలకొల్పడం కోసం ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్' ను ఇజ్రాయెల్ ప్రకటించింది.
- తోమాహాక్ లాంగ్ రేంజ్ మిస్సైళ్లను ఉక్రెయిన్‌కు ఇచ్చేందుకు అమెరికా ఆసక్తిగా ఉన్నట్లు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు.
- జపాన్ మాజీ ప్రధాని తొమిచి మురయమ కన్నుమూశారు. ఆయన వయసు 101 ఏళ్లు.
- ఐక్యరాజ్యసమితి మావన హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి ఏడో సారి భారత్ ఎన్నికైంది. 2026 నుంచి 2028 వరకు ఈసమితిలో భారత్‌కు సభ్యత్వం ఉంటుంది.
- ఎడ్మండ్ హిల్లరీ, టెంజింగ్ నార్గేతో కలిసి ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిన నేపాలీ పర్వతారోహకుడు కంచ షెర్పా కన్నుమూశారు.
- ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మధ్య జరిగిన శాంతి చర్చలు ఫలించాయి.
- పాకిస్థాన్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ మిస్సైల్ రేంజ్‌లో ఉన్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.
- దక్షిణ అమెరికా దేశం పెరూలో అవినీతికి వ్యతిరేకంగా జెన్ జీ నిరసనలు వెల్లువెత్తాయి.
- అమెరికా డైవర్సిటీ వీసా(డీవీ) లాటరీ నుంచి భారతీయులను 2028 వరకు అమెరికా మినహాయించింది.
- మడగాస్కర్ నూతన అధ్యక్షుడిగా కర్నల్ మైఖేల్ రాండ్రియానిరినా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.
- చైనాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌లో వెన్నం జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం గెలిచింది.

# రాష్ట్రీయం

**అక్టోబరు 13 - అక్టోబరు 19**

- గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో ఏపీ ప్రభుత్వం విశాఖపట్నంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ కంపెనీ రూ.88,628 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్ ఏర్పాటుతో వైజాగ్ ఏఐ సిటీగా మారనుంది. 1 గిగా వాట్ సామర్థ్యంతో ఏర్పాటు కానున్న ఈ డేటా సెంటర్ ఆసియాలోనే గూగుల్ సంస్థకు అతి పెద్ద డేటా సెంటర్.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం మల్లన్న స్వామిని దర్శించుకున్నారు.
- హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీ లో శిక్షణ పూర్తిచేసుకున్న 77వ బ్యాచ్ ఐపీఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్‌కి బీఎస్‌ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది.
- 'నా ఆలోచనలు' పుస్తకాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు.

# జాతీయం

**అక్టోబరు 13 - అక్టోబరు 19**

- లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ) తేజస్ ఎంకే 1ఏ యుద్ధ విమానం మహారాష్ట్రలోని నాసిక్ ఎయిర్‌బేస్ నుంచీ విజయవంతంగా పరీక్షించారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు చెందిన మూడవ ఉత్పత్తి కేంద్రం నుంచి హిందుస్థాన్ టర్బో ట్రైనర్ ఈ విమానాన్ని స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేశారు.
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావు తన ఆయుధాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవీస్‌కు అప్పగించి లొంగిపోయారు.
- మావోయిస్టు పార్టీలో మరో కీలక సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ 140 మంది దళంతో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట లొంగి పోయారు. వాసుదేవరావు ప్రస్తుతం మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీఎం), స్టేట్ మిలటరీ కమిషన్(ఎస్‌ఎంసీ), నార్త్ సబ్ జోనల్ బ్యూరో (ఎన్‌ఎస్‌జడ్‌బీ) కార్యవర్గ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.
- అహ్మదాబాద్ వేదికగా 2030 కామన్‌వెల్త్ క్రీడలు జరగనున్నాయి. విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు.




- శక్తివంతమైన పాస్‌పోర్టు జాబితాలో భారత్ ర్యాంకు దిగజారింది. 2025 హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో 57 దేశాలకు వీసారహిత ప్రయాణ సదుపాయం ఉన్న భారత్ ర్యాంకు 85కి పడిపోయింది. గత ఏడాది 62 దేశాలకు వీసారహిత ప్రయాణ సదుపాయం ఉన్న భారత్ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో 80వ ర్యాంకులో ఉండేది.
- భారత అంతరిక్ష రంగంలో అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతున్న ఇస్రో 2040లో చందమామపైకి భారత వ్యోమగామిని పంపనున్నట్లు ఇస్రో చీఫ్ నారాయణన్ తెలిపారు.
- కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగ కేరళలో ఆస్పత్రిలో గుండెపోటుతో మృతిచెందారు.
- గోవా మాజీ సీఎం రవి నాయక్ కన్నుమూశారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు చెందిన భరత్ తమ్మినేని(36) ప్రపంచంలోని 14 ఎత్తయిన పర్వతాల్లో 9 ఎత్తయిన పర్వతాలెక్కిన తొలి భారతీయుడిగా అరుదైన రికార్డ్ సృష్టించారు.
- తొలిసారి చేపట్టిన డీఎన్‌ఏ ఆధారిత లెక్కింపులో భారత్‌లో అడవి ఏనుగులు సరాసరి 22,446 ఉన్నట్టు తేలింది. (2017 నాటి ఏనుగుల సంఖ్య 27,312)
- భారత్‌లో 2022 ఏడాదితో పోల్చితే 2023లో జననాల సంఖ్య తక్కువగా, మరణాల సంఖ్య ఎక్కువగా నమోదైంది. 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం' (సీఆర్‌ఎస్) ఆధారంగా రూపొందిన నివేదిక ప్రకారం, మనదేశంలో 2022లో జననాలు 2.54 కోట్లుకాగా, 2023లో 2.52కోట్లకు తగ్గింది. జననాల సంఖ్యలో 2,32,000 తగ్గుదల ఉందని నివేదిక పేర్కొన్నది. మరణాల సంఖ్య 2022లో 86.5 లక్షలు కాగా, 2023లో 86.6 లక్షలుగా ఉంది. కొవిడ్-19 కారణంగా 2025 మే 5 నాటికి మొత్తం 5,33,665 మంది మరణించినట్టు నివేదిక తెలిపింది. దేశంలో ఒడిశా, మిజోరం, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఏపీలో అత్యధిక జననాలు నమోదయ్యాయి.
- భారత్‌కు చెందిన షెర్రీ సింగ్ మిసెస్ యూనివర్స్ 2025 కిరీటాన్ని దక్కించుకున్నారు.








# వీక్లీ రౌండప్

# విద్య, ఉద్యోగ సమాచారం




**ఏపీలో పెరిగిన మెడికల్ సీట్లు**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మెడికల్ సీట్లలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుండగా తాజాగా పలు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులు లభించాయి. దాదాపు 250 ఎంబీబీఎస్ సీట్లకు జాతీయ వైద్య కమిషన్ కొత్తగా అనుమతులు ఇచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 250 ఎంబీబీఎస్ సీట్లు పెరిగినట్లైంది. పుత్తూరు అన్నా గౌరి వైద్య కళాశాలలో 100 సీట్లను 150కు పెంచారు. కర్నూలు శాంతిరామ్ వైద్య కళాశాలలో 150 సీట్లను 250కు పెంచారు. విశాఖపట్నం ఎన్నారై మెడికల్ కాలేజీలోనూ ఇప్పటికే ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లను 250కి పెంచారు. పెరిగిన ఈ సీట్లకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌ఓపీ) రావాల్సి ఉంది. మూడో విడత కౌన్సెలింగ్‌లో పెరిగిన ఈ సీట్లను భర్తీ చేయనున్నట్లు విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేర్కొంది.

**ఎస్ఎస్‌సీ సీజీఎల్ టైర్ 1 ప్రాథమిక కీ విడుదల..**

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ 2025 టైర్ 1 రాత పరీక్ష ప్రాథమిక ఆన్సర్ కీ విడుదలైంది. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి ఆన్సర్ కీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్సర్ కీతోపాటు రెస్పాన్స్‌షీట్లను కూడా కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచింది. అభ్యర్థులు అక్టోబర్ 19వ తేదీ వరకు ఆన్సర్ కీ పై అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది ఆన్సర కీతో, ఫలితాలను వెల్లడించనున్నట్లు ఎస్ఎస్‌సీ పేర్కొంది. కాగా ఎస్ఎస్‌సీ సీజీఎల్ టైర్ 1 పరీక్షలు సెప్టెంబర్ 12 నుంచి 26 వరకు మొత్తం 15 రోజుల పాటు నిర్వహించారు.

**కొత్త డీఎస్సీ నోటిఫికేషన్....**



ఏపీ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ త్వరలో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. అయితే అంతకంటే ముందు టెట్ పరీక్ష మరోమారు నిర్వహించాలని విద్యాశాఖ భావిస్తుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే జారీ చేయనుంది. ఈసారి టెట్ పరీక్షకు అర్హతల విషయంలో పూర్తిగా ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనలను పాటించాలని విద్యాశాఖ భావిస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న టెట్ నిబంధనలు డీఎస్సీ నిర్వహణ సమయంలో న్యాయ వివాదాలకు దారితీస్తున్నాయి. అందుకే న్యాయ వివాదాలు తలెత్తకుండా టెట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతల్లో డిగ్రీ మార్కులు, వయసు, ఇతర అంశాలను పూర్తిగా ఎన్‌సీటీఈ నిబంధనలనే అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇక టెట్ నోటిఫికేషన్ నవంబర్ నెలలో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే వెల్లడించారు.

**జేఈఈ మెయిన్ 2026 పరీక్షల షెడ్యూల్**

జేఈఈ మెయిన్ 2026 సెషన్ 1, 2 పరీక్షల షెడ్యూల్‌ను ఎన్‌టీఏ విడుదల చేసింది. మొదటి షెడ్యూల్ పరీక్షలు జనవరి 24 నుండి ఫిబ్రవరి 1 మధ్య జరుగుతాయి. ఈ సెషన్‌కు హాజరు కావాలనుకునే విద్యార్థులు అక్టోబర్ నుంచే తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలి. సెషన్ 2 పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య నిర్వహిస్తారు. ఈ పరీక్షలు జరిగే కచ్చితమైన తేదీలను తర్వాత వెల్లడించనున్నట్లు ఎన్టీయే తన ప్రకటనలో తెలిపింది. ఈలోగా విద్యార్థులు ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోవాలి.

జేఈఈ (మెయిన్) 2026 పరీక్షకు దరఖాస్తు చేసుకునే ముందే అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌డేట్ చేసుకోవాలి. ముఖ్యంగా ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం సరిగా ఉండేలా అప్‌డేట్ చేసుకోవాలి. తాజా ఫొటోగ్రాఫ్, ఇంటి అడ్రస్, తండ్రి పేరు ఆధార్ కార్డులో అప్‌డేట్ చేసుకోవాలి. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ-ఎన్‌సీఎల్ కేటగిరీ సర్టిఫికెట్‌లు అప్డేట్ చేసుకోవాలి. ఇతర వివరాలకు www.nta.ac.in, https://jeemain.nta.nic.in అధికారిక వెబ్‌సైట్‌లను చూడండి.

**యూజీసీ నెట్ నోటిఫికేషన్**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) UGC NET 2025 పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ లేదా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం దర ఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు ugcnet.nta.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు :

పరీక్ష కోసం జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.1150 దరఖాస్తు ఫీజు చెల్లించాలి. EWS, OBC అభ్యర్థులు రూ. 600 ఫీజు చెల్లించాలి. ST,SC, PWD, థర్డ్ జెండర్ అభ్యర్థులు రూ. 325 ఫీజు చెల్లించాలి.

**యూజీసీ నెట్ 2025 డిసెంబర్ ముఖ్యమైన తేదీలు..**

ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రారంభ తేదీ: అక్టోబర్ 7, 2025.

ఆన్‌లైన్ అప్లికేషన్ చివరి తేదీ: నవంబర్ 7, 2025

ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులకు చివరి తేదీ: నవంబర్ 7, 2025 రాత్రి 11.50 గంటల వరకు.

అప్లికేషన్ సవరణ తేదీలు: నవంబర్ 10 -12వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు.